క్లుప్తంగా

షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి


ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు వినతిపత్రం అందజేస్తున్న గంగాపూర్ ప్రజలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని రెబ్బెన మండలానికి చెందిన గంగాపూర్ గ్రామంలోని పూలాజీబాబా ధ్యాన మందిరంలో షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు వినతిపత్రం అందజేశారు. సమస్యపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తానని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

జాతరకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

కాగజ్‌నగర్‌టౌన్: తిర్యాణి మండలంలోని గడలపల్లిలో ఈనెల 21న నిర్వహించే శ్రీశ్రీ పహ్యాండి పారి కూపర్ లింగో కట్ ముట్టి పూజ కార్యక్రమంలో పాల్గొనాలని శుక్రవారం నిర్వహణ కమిటీ పదాధికారులు సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్పను కోరారు. ఈమేరకు ఆయన నివాసంలో కలిసి ఆహ్వానపత్రం అందజేశారు.

మార్కండేయ స్వామి దీక్ష స్వీకరణ

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని స్థానిక ఎస్పీఎం ఓల్డ్ కాలనీలో గల శ్రీ మార్కండేయ ఆలయంలో శుక్రవారం పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు మార్కండేయ మాలధారణ దీక్ష చేపట్టగా పూజారి కరుణాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పరామర్శ


పరామర్శిస్తున్న కనక ప్రతిభ వెంకటేశ్వర్‌రావు

నార్నూర్(జైనూర్): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో చికిత్స పొందుతున్న మార్లావాయి గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు జుగ్నాక గోవింద్‌రావును సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్వర్‌రావు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

రేషన్ బియ్యం పంపిణీ


పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాంతయ్య

కౌటాల: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గురుడుపేట ఆధ్వర్యంలో కౌటాల కార్యాలయంలో శుక్రవారం రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సహకార సంఘం కార్యాలయంలో బియ్యం పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంఘం సీఈవో రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో(రూ.లో)
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	40
టమాట	20
బీరకాయ	40
కాకరకాయ	80
బెండకాయ	60
అలసంత	40
దొండకాయ	60
మిర్చి	50
సోరకాయ	80
చిక్కుడుకాయ	60
గోబి (పూల్)	80
క్యాబేజి	60

- ఆసిఫాబాద్‌అర్బన్

సినిమాలు

ఆసిఫాబాద్ (కుమురం భీం):
వీరసంహారెడ్డి
కాగజ్‌నగర్ (వెంకటరమణ):
వీరసింహారెడ్డి

అటవీ సిబ్బంది కొరత

- కెరమెరి రేంజ్‌లో 35 మందికి ఉన్నది ఏడుగురే
- అడవుల విస్తీర్ణం 24 వేల హెక్టార్లు



కెరమెరిలోని అటవీ రేంజ్ కార్యాలయం

కెరమెరి: అడవుల రక్షణ అటవీ అధికారులకు పెను సవాల్‌గా మారింది. కెరమెరిలో ఉన్న ఐదుగురు బీట్ అధికారుల్లో ఇటీవల ముగ్గురు సస్పెన్షన్ కావడంతో ఇద్దరు అధికారులతో అటవుల రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. ఇదే అదునుగా భావించిన అక్రమార్కులు కలను యథేచ్ఛగా తరలించుకుంటున్నారు. ఓ వైపు అడవులు రక్షించాలని అధికారులకు పదేపదే ఆదేశాలు జారీ చేసున్నప్పటికి సిబ్బంది నియామకంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

కుమురం భీం ఆసిఫాబాద్ ఏర్పడిన తర్వాత కెరమెరి, జైనూర్, సిర్పూర్(యు) మూడు మండలాలను కలిపి కొత్తగా కెరమెరిలో అటవీ రేంజ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. కాని ఈ రేంజ్‌కు సరిపడా సిబ్బంది లేక అనేక ఇబ్బంది ఏర్పడుతున్నాయి. జిల్లాలోనే అత్యధిక విస్తీర్ణం కల రేంజ్ కెరమెరి కావడంతోపాటు కలప అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో ఉన్న అటవీ అధికారుల అక్రమ కలప రవాణా పెద్ద తలనొప్పిగా మారింది. తక్కువగా సిబ్బంది ఉండడంతో చాలా కష్టమవుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

ఉన్నది ఏడుగురే..

కెరమెరి రేంజ్ పరిధిలో మూడు మండలాలు ఉన్నాయి. వాస్తవానికి అటవీ సెక్షన్ అధికారులు 10, అటవీ బీట్ అధికారులు 25 మంది ఉండాలి. కాని ఇక్కడ ఉన్నది ఇద్దరు బీట్ అధికారులు, సెక్షన్ అధికారులు 5 మంది ఉన్నారు. మూడు మండలాలు కలిపి 24 వేల హెక్టార్ల (సుమారు ఒక లక్ష ఎకరాలలో) అడవుల వ్యాపించి ఉన్నాయి. కలప పుష్కలంగా లభించడంతో అక్రమార్కులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ముఖ్యంగా జోడేఘాట్ సెక్షన్‌లో యథేచ్ఛగా కలపు రవాణా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల జోడేఘాట్ నుంచి వస్తున్న ఓ వ్యాన్‌ను నిలిపివేసి తనిఖీలు చేపట్టగా మూడు కలప దుంగలు ఉన్నాయి. వాటిని స్వాధీనం చేసుకుని సదరు అక్రమార్కునిపై కేసు నమోదు చేశారు. అయితే పది దుంగలు ఉన్నాయని అధికారులు ఏడు దుంగలను ఓ గిరిజనుడి ఇంట్లో వేసి మూడు చూపించారు. సదరు గిరిజనుడు గ్రామస్తులు, నాయకులతో కలిసి రోడ్డుపై ఆందోళన చేపట్టారు. అధికారులపై చర్యలకు పట్టుబట్టడంతో డీఎఫ్‌వో విచారణ చేపట్టి కెరమెరిలో ఉన్న ముగ్గురు బీట్ అధికారులను విధుల నుంచి తొలగించారు. కెరమెరిలో నాలుగు రోజుల క్రితం వరకు ఐదుగురు బీట్ అధికారులు ఉండగా.. ప్రస్తుతం ఇద్దరే ఉన్నారు.


పరంధోలిలో దట్టమైన అడవులు

సిబ్బంది కొరతతో ఇబ్బంది



రేంజ్‌లో సరిపడా సిబ్బంది లేకపోవడంతో చాలా ఇబ్బంది అవుతుంది. కెరమెరిలో దట్టమైన అడవులు ఉండడంతో రక్షణ ఇబ్బందిగా మారింది. రాత్రి, పగలు నిఘా పెట్టడం కష్టమవుతుంది. ఏడుగురు సిబ్బందితో లక్ష ఎకరాలను కాపాడడం కష్టతరం. ప్రభుత్వం వెంటనే సిబ్బందిని నియమించాలి.

- సయ్యద్ మజారోద్దిన్, ఎఫ్‌ఆర్వో, కెరమెరి

కనుల పండువగా కల్యాణోత్సవం


శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని రాజస్థాన్ భవన్‌లో శుక్రవారం సాయంత్రం మార్వాడీ సమాజ్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా గోదాదేవి -రంగనాథుడి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పూజారి పురుషోత్తం మహరాజ్ ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. రాత్రి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా దేవతామూర్తుల శోభయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'కంటివెలుగు' విజయవంతం చేయండి

నార్నూర్: ప్రభుత్వం ఈనెల 18 నుంచి నిర్వహించనున్న కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హెచ్ఈ రవీందర్ అన్నారు. శుక్రవారం ఝరి ప్రాథమి ఆరోగ్య కేంద్రంలో ఆవరణంలో కంటివెలుగు కార్యక్రమంపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. సర్పంచ్‌లు డప్పు చాటింపు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: ఆదర్శ పాఠశాలల్లో 2023- 24 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆదిలాబాద్ రూరల్ మండలంలోని బంగారుగూడ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కె. సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు 6వ తరగతికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 6వ తరగతి నూతన అడ్మిషన్లతో పాటు 7, 8, 9, 10వ తరగతులలో ఖాళీగా ఉన్న వాటి భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదలైందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఫిబ్రవరి 15 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అండర్-15 సైకిల్ పోటీలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల స్థాయిలో 15వ తేదీ ఆదివారం 'యువరాజ్యం స్వచ్ఛంధ సంస్థ' ఆధ్వర్యంలో అండర్-15 సైకిల్ రేస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 15సంవత్సరాలలోపు పిల్లలు సైకిల్ రేస్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని ఇందుకు ఆధార్‌కార్డుతో పాటు సొంత సైకిల్‌తో పోటీలకు హాజరుకావాలని తెలిపారు. మొదటి విజేతకు రూ.3వేలు, రెండో విజేతకు రూ.2వేలు, మూడో విజేతకు రూ.వెయ్యి నగదు బహుమతిగా ఇవ్వనున్నట్లు తెలిపారు.

చైనా మాంజా వాడితే చర్యలు


దహెగాం: తనిఖీ చేస్తున్న అటవీ అధికారులు

దహెగాం: గాలి పటాలు ఎగురవేయడానికి చైనా మాంజాను వాడితే చర్యలు తీసుకుంటామని డీఆర్వో శ్రీధర్ చారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కిరాణా దుకాణాల్లో అటవీ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. చైనా మాంజాతో పక్షులకు, ప్రజలకు ప్రాణహాని ఉంటుందన్నారు. ఎఫ్ఎస్‌వో సతీష్‌కుమార్, బీట్ అధికారులు మధూకర్, సద్దాం, సుధాకర్ ఉన్నారు.


వాంకిడి: తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

వాంకిడి: చైనా మాంజా అమ్మినా, నిల్వ ఉంచినా చర్యలు తీసుకుంటామని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు. మండల కేంద్రంలోని కిరాణా, జనరల్ స్టోర్ దుకాణాల్లో మండల అటవీశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. డీఆర్వో సరోజ రాణి, ఎఫ్ఎస్‌వోలు లక్ష్మణ్, సత్యనారాయణ, భగవంత్ రావు, అత్తరుద్దిన్, ఎఫ్‌బీవోలు నాగేందర్, సుమన్, శ్రీను, రజిత, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలి

మందమర్రిరూరల్: పార్టీ శ్రేణులు ప్రజాసమస్యలను తెలుసుకుంటూ సీపీఐ పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఏఐటీయూసీ ఆఫీస్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందేలా చూడాలని, ఓపెన్ కాస్ట్ గనుల్లో భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలని, తదితర సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే పార్టీ ఆందోళన కార్యక్రమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ పట్టణ కార్యదర్శి కామెర దుర్గరాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు మిట్టపల్లి పౌల్, వనం సత్యనారాయణ, రాజేశం, తదితరులు ఉన్నారు.

శునకాలకు చర్మ రోగం

చెన్నూర్‌రూరల్: మండల కేంద్రంతో పాటు అంగ్రాజ్‌పల్లి, కత్తెరసాల గ్రామాల్లో శునకాలు చర్మవ్యాధి బారినపడి మృతి చెందుతున్నాయి. వెంట్రుకలు మొత్తం ఊడిపోయి, చర్మం మొత్తం బయటపడుతూ, దుర్వాసన వెదజల్లుతూ చనిపోతున్నాయి. ఈ వ్యాధి ఒక దాని నుంచి మరో శునకానికి సోకుతుంది. ఈ విషయమై కత్తెరసాల పశువైద్యాధికారిని వివరణ కోరగా ఇది తీవ్రచర్మ రోగం అని తెలిపారు. టీకాలు వేసి వైద్యం అందిస్తామన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ ఆర్‌యూపీపీ- టీఎస్ క్యాలెండర్‌ను శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏడీ కె. నర్సింలు, జిల్లా అధ్యక్షుడు పొచ్చన్న, రాష్ట్ర కార్యదర్శి సోమ శ్యాంసుందర్ రెడ్డి, సెక్టోరియల్ అధికారి మహేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి జావిద్ అలీ పాల్గొన్నారు.

పండుగ తర్వాతే బెటర్!

- పత్తి విక్రయానికి రైతుల అనాసక్తి
- ధర గిట్టుబాటు కాకపోవడమే కారణం
- ఇళ్లల్లో భారీగా నిల్వలు
- గతేడాది సంక్రాంతి తర్వాత పెరిగిన ధర

కెరమెరి: ఆరుగాలం శ్రమించి పండించిన పత్తి పంటకు ధర లేకపోవడంతో విక్రయానికి రైతులు మొగ్గు చూపడం లేదు. పత్తి పంట తీసి నెలరోజులు గడుస్తున్నా మార్కెట్‌కు తరలించకుండా ఇళ్లల్లోనే పత్తి నిల్వ చేస్తున్నారు. దీంతో పలువురి రైతు ఇళ్లల్లో పత్తి నిల్వలు భారీగా పేరుకుపోయాయి. కాగా సంక్రాంతి తర్వాత పత్తి పంట ధర పెరుగుతుందనే ఆశలో రైతులు ఉన్నారు. మండలంలో మొత్తం 6400 మంది రైతులు ఉండగా, 22 వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నారు.

గతేడాది పెరిగిన ధర

గతేడాది సంక్రాంతి పండుగ తర్వాత పత్తి పంటకు ధర పెరిగింది. ప్రారంభంలో క్వింటాల్‌కు రూ.6500 ఉండగా పండుగ తర్వాత క్రమంగా పెరిగి రూ.12000 కూడా పలికింది. కాని ఈసారి ప్రారంభంలో రూ.9200 పలికిన ధర ఒకేసారి రూ.8400కు తగ్గి ప్రస్తుతం రూ.7600 నుంచి రూ.8000 వరకు పలుకుతుంది. అయితే పండుగ తర్వాత ధర మరింత పెరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ధర పెరిగిన తర్వాత పంట విక్రయించాలని ఇళ్లలోనే నిల్వ చేస్తున్నారు. కాని రైతులు అనుకున్న స్థాయిలో ఈసారి ధర పెరగకపోవచ్చని క్వింటాల్ పత్తి రూ.8500 కంటే దాటకపోవచ్చని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే ఇప్పటికే ఇళ్లల్లో భద్రపర్చుకున్న పత్తి బరువు తగ్గుతున్న నేపథ్యంలో రైతులు కొంత ఆందోళన చెందుతున్నారు.


మెట్టపిప్రిలో రైతు ఇంట్లో నిల్వ ఉంచిన పత్తి

పెట్టుబడి పెరిగింది



ఈ సారి పత్తికి ధర బాగా పలుకుతుందని పెట్టుబడి ఎక్కువగా పెట్టాను. నాకున్న ఐదెకరాల్లో రూ.1లక్షకు పైగా ఖర్చు చేశాను. కాని పత్తి పంటలో దిగుబడి రాలేదు. వచ్చిన పంటకు ధర లేకపోవడంతో పెట్టుబడి కూడా అందని పరిస్థితి నెలకొంది. పండుగ తర్వాత ధర పెరిగితే కొంత వరకు నష్టం తగ్గుతుంది.

- నాగోసే భీంరావు, రైతు, సావర్‌ఖేడా

క్రీడల్లో గెలుపోటములు సహజం


కౌటాల: బహుమతులు ప్రదానం చేస్తున్న ఫాదర్లు


బెజ్జూర్: కుంటలమానెపల్లిలో కుమురం భీం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

బెజ్జూర్: మండలంలోని కుంటలమానెపల్లి గ్రామంలో కుమురంభీం స్మారక క్రీడోత్సవాల్లో భాగంగా శుక్రవారం కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బహుమతులు అందజేశారు. కబడ్డీలో విజేతగా కాటెపల్లి జట్టు, రన్నరప్‌గా రెబ్బెన జట్టు, వాలీబాల్‌లో విజేతగా కుంటలమానెపల్లి జట్టు, రన్నరప్‌గా చింతలమానెపల్లి జట్టు నిలిచాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. అంతకుముందు కుమురంభీం చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట జెడ్పీటీసీ పుష్పలత, పీఏసీఎస్ చైర్మన్ ఓం ప్రకాష్, మండల కోఆప్షన్ సభ్యుడు బషరత్‌ఖాన్, ఎంపీటీసీ లంగారి శ్రీనివాస్, సర్పంచ్‌లు జాజిమొగ్గ శ్రీనివాస్, ఉపాసీ సంజీవ్, చాకటి విజయ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సకారం తదితరులు ఉన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

దహెగాం: మండలంలోని గిరవెల్లి గ్రామంలో శుక్రవారం ప్రజాబంధు స్వర్గీయ పాల్వాయి పురుషోత్తం రావు స్మారకార్థం క్రికెట్ పోటీలను సర్పంచ్ ఎల్కరి సంజీవ్ ప్రారంభించారు. చంద్రపల్లి సర్పంచ్ లగ్గామ దామోదర్, నాయకులు దందెర రాజు, వెంకన్న, లచ్చన్న, మల్లేష్, సురేష్ పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

చింతలమానెపల్లి: మండలంలోని బాబాపూర్ గ్రామంలో సైదం పోచయ్య స్మారక వాలీబాల్ పోటీలను శుక్రవారం ఎంపీపీ డుబ్బుల నానయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో అవకాశాలను వినియోగించుకుని రాణించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, సుధాకర్, కోటేష్, విఘ్నేష్ పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం

కౌటాల: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఉమ్మడి ఆదిలాబాద్ కథోలిక సంఘం యూత్ డైరెక్టర్ జీజో అన్నారు. శుక్రవారం మండలంలోని విజయనగరం గ్రామంలోని చర్చి మైదానంలో ఆదిలాబాద్ మేత్రాసన యువత విభాగం ఆధ్వర్యంలో ఫాదర్ జోశి మెమోరియల్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫాదర్లు టోం, ప్రవీణ్, సీజో, టోణి, సతీష్, జోబి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది


నీంగూడలో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న సక్కు

కెరమెరి: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్న సాకడ (శ్యాంరావుగూడ)లో పెందూర్ జంగు 23వ స్మారకార్థం శ్రీబాబా యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలను, అలాగే ఆగర్వాడ గ్రామ పంచాయతీలోని నీంగూడలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఎంపీపీ మోతిరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి, వైస్ఎంపీపీ అబ్దుల్ కలాం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆనంద్‌రావు, సర్పంచ్‌లు మధూకర్, న్యానేశ్వర్, నాయకులు అనిల్, భీంరావు, సోము, శ్రీనివాస్, దంబిరావు, ధర్మూ, తుకారాం, సిరాజ్, హన్మంతు, సుధాకర్, జాఫర్, రాంచందర్, సతీశ్ తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

జైపూర్: పరిసరాల పరిశుభ్రత పాటించాలని డీఆర్‌డీవో శేషాద్రి సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం స్వచ్ఛ శుక్రవారం కార్యక్రమం నిర్వహించగా, పలు వీధుల్లో పర్యటించి సిబ్బందికి సూచనలు చేశారు. పచ్చదనం, పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించి ఎప్పటికప్పుడు చెత్తాచెదారాన్ని, పిచ్చిమొక్కలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్పంచ్ సువర్ణ, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో అనిల్‌కుమార్, ఏపీవో బాలయ్య, కార్యదర్శి ఉదయ్, బిల్‌కలెక్టర్ మల్లేశ్, వార్డుసభ్యులు ఉన్నారు.

కోటపల్లి: ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బాల్కసుమన్ ఆదేశాల మేరకు చెన్నూర్ 5 మండలాల్లో ఉన్న గ్రామపంచాయతీలను ఉత్తమ గ్రామపంచాయితీలుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో స్వచ్ఛ శుక్రవారం ప్రవేశపెట్టారని సర్పంచ్ లక్ష్మణ్‌గౌడ్, ఎంపీటీసీ తిరుపతి తెలిపారు. గ్రామంలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు పారిశుద్య కార్యక్రమాల్లో పాల్గొనేలా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని చైతన్య డిగ్రీ, జూనియర్ కళాశాలలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కరస్పాండెంట్ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని శ్రీ భూగోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయ 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు శివదత్తగిరి మహరాజ్ ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి 17 వరకు ఆలయంలో పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మొదటి రోజు దేవత్వాహనము, బలిహరణం, హారతి, చివరి రోజు లక్ష్మీ, పద్మావతి వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగాధర్ రెడ్డి తెలిపారు. సర్పంచ్ రాజన్న, గ్రామపెద్దలు సుగుణాకర్ రెడ్డి, మార్శెట్టి అనిల్, సంతోష్ పాల్గొన్నారు.